క్లుప్తంగా

పెద్దమ్మతల్లికి ప్రత్యేక పూజలు



పూజలో మాజీ ఎమ్మెల్యే మల్‌రెడ్డి

యాచారం: గునుగల్ గ్రామంలో నూతనంగా ప్రతిష్ఠించిన పెద్దమ్మ, గంగమ్మ తల్లి దేవతా మూర్తులకు మాజీ ఎమ్మెల్యే మల్‌రెడ్డి రంగారెడ్డి సోమవారం ప్రత్యేక పూజలు నిర్వహించారు. ఈ కార్యక్రమంలో యాచారం మండల పరిషత్ ఉపాధ్యక్షుడు శ్రీనివాస్‌రెడ్డి, ఇబ్రహీంపట్నం వ్యవసాయ మార్కెట్ కమిటీ మాజీ చైర్మన్ గురునాథ్‌రెడ్డి, మాజీ సర్పంచ్ భిక్షపతి తదితరులు పాల్గొన్నారు.

జూలపల్లిలో శివాజీ విగ్రహావిష్కరణ



శివాజీ విగ్రహాన్ని ఆవిష్కరిస్తున్న ప్రశాంత్‌రెడ్డి

తలకొండపల్లి: యువత ఛత్రపతి శివాజీని ఆదర్శంగా తీసుకోవాలని సర్పంచ్ బక్కి కుమార్ అన్నారు. మండల పరిధిలోని జూలపల్లిలో హనుమాన్ యూత్ ఆధ్వర్యంలో విగ్రహదాత సాయిప్రశాంత్‌రెడ్డి సహకారంతో ఆదివారం రాత్రి ఛత్రపతి శివాజీ విగ్రహావిష్కరణ కార్యక్రమాన్ని నిర్వహించారు. కార్యక్రమంలో ప్రశాంత్‌రెడ్డి, విజయ్‌రెడ్డి, కుమార్, ఫ్రెండ్స్‌యూత్, యువసేన యూత్ సభ్యులు, గ్రామ పంచాయతీ పాలక మండలి సభ్యులు, వివిధ గ్రామాల సర్పంచ్‌లు, ప్రజాప్రతినిధులు, నాయకులు పాల్గొన్నారు.

నర్సింహారెడ్డికి గ్రేడ్-1 కార్యదర్శిగా పదోన్నతి



అబ్దుల్లాపూర్‌మెట్: బాటసింగారంలోని గడ్డిఅన్నారం వ్యవసాయ మార్కెట్ కార్యదర్శిగా కొనసాగుతున్న చిలుక నర్సింహారెడ్డికి గ్రేడ్-1 కార్యదర్శిగా పదోన్నతి లభించింది. గ్రేడ్-2 కార్యదర్శిగా కొనసాగుతున్న ఆయన గడ్డిఅన్నారం పండ్ల మార్కెట్ కార్యదర్శిగా పనిచేస్తుండగా, పదోన్నతి రావడంతో ప్రస్తుతం హైదరాబాద్ మార్కెట్ కార్యదర్శిగా అధికారులు బదిలీ చేసినట్లు తెలిసింది. అయితే గడ్డిఅన్నారం వ్యవసాయ మార్కెట్ ఇన్‌చార్జి సెక్రటరీగా వెంకటలక్ష్మి కొనసాగుతుండగా చిలుక నర్సింహారెడ్డి తిరిగి గడ్డిఅన్నారం మార్కెట్‌కే గ్రేడ్-1 కార్యదర్శిగా ప్రభుత్వం నియమించే అవకాశమున్నట్లు మార్కెట్ అధికారులు పేర్కొన్నారు.

రాష్ట్ర కోటా బియ్యం పంపిణీ చేయాలి

వైఎస్సార్‌టీపీ నేత జంగయ్యగౌడ్

మంచాల: రాష్ట్ర కోటా కింద ప్రతి కార్డుదారుడికి పది కిలోల ఉచిత రేషన్ బియ్యం పంపిణీ చేయాలని వైఎస్సార్‌టీపీ నాయకుడు మాదగోని జంగయ్య గౌడ్ డిమాండ్ చేశారు. సోమవారం వైఎస్సార్ టీపీ మండల అధ్యక్షుడు నేనావత్ శ్రీనివాస్‌నాయక్ ఆధ్వర్యంలో మంచాల తహసీల్దార్ అనితకు వినతిపత్రం అందజేశారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ.. రేషన్ దుకాణాల్లో సగటు మనిషికి పది కిలోల చొప్పున రేషన్ బియ్యం అందించాలి. నేడు కేవలం కేంద్ర ప్రభుత్వ కోటా కింద మాత్రమే బియ్యం వస్తున్నాయి. రాష్ట్ర ప్రభుత్వం కోటా ఇవ్వడం లేదన్నారు. దీంతో మనిషికి పది కిలోలకు బదులు ఐదు కిలోలు మాత్రమే రేషన్ బియ్యం అందిస్తున్నారని తెలిపారు. గత నాలుగైదు నెలలుగా ప్రజలు ఇబ్బందులు ఎదుర్కొంటున్నారని అన్నారు. తక్షణమే రాష్ట్ర కోటా రేషన్ బియ్యం అందించాలని డిమాండ్ చేశారు. ఈ కార్యక్రమంలో మండల ఎస్సీసెల్ నాయకుడు మురళి తదితరులు పాల్గొన్నారు.

పంచాయతీల్లో మౌలిక వసతులు కల్పిస్తాం

సర్పంచ్‌ల సంఘం రాష్ట్ర అధ్యక్షుడు లక్ష్మీనర్సింహారెడ్డి

కడ్తాల్: రాష్ట్ర ప్రభుత్వం గ్రామ పంచాయతీల్లో మౌలిక వసతుల కల్పనకు ప్రత్యేక నిధులు కేటాయించడం జరుగుతుందని సర్పంచ్‌ల సంఘం రాష్ట్ర అధ్యక్షుడు లక్ష్మీనర్సింహారెడ్డి అన్నారు. మండల కేంద్రంలో నూతనంగా వెలుస్తున్న కాలనీల్లో పంచాయతీరాజ్ ఏఈ పరమేశ్‌తో కలిసి సోమవారం ఆయన పర్యటించారు. డ్రైనేజీ, సీసీ రోడ్ల సమస్యలను తెలుసుకున్నారు. అందుబాటులో ఉన్న నిధులతో పాటు, స్థానిక ప్రజాప్రతినిధుల సహకారంతో అంతర్గత డ్రైనేజీల నిర్మాణం, సీసీ రోడ్ల నిర్మాణ పనులు ప్రారంభించనున్నట్లు తెలిపారు. సాయిరాంనగర్ కాలనీలో రూ.20 లక్షల వ్యయంతో అంతర్గత మురుగుకాల్వలు, సీసీ రోడ్ల నిర్మాణ పనులు చేపట్టనున్నట్లు పేర్కొన్నారు. ఈ కార్యక్రమంలో మార్కెట్ కమిటీ డైరెక్టర్ లాయక్‌అలీ, ఉప సర్పంచ్ రామకృష్ణ, స్థానికులు కేశవరెడ్డి తదితరులు ఉన్నారు.

రాజకీయాలకతీతంగా అభివృద్ధి

- ఆమనగల్లు మున్సిపల్ పాలకవర్గం, అధికారులతో ఎమ్మెల్యే జైపాల్‌యాదవ్ సమీక్ష
- వార్డుల్లో చేపట్టాల్సిన పనులపై చర్చ
- సమన్వయంతో పనిచేయాలని ఆదేశం



సమావేశంలో మాట్లాడుతున్న ఎమ్మెల్యే జైపాల్‌యాదవ్

ఆమనగల్లు: అభివృద్ధిలో రాజకీయాలకు అతీతంగా పనిచేద్దామని ఎమ్మెల్యే జైపాల్‌యాదవ్ అన్నారు. ఆమనగల్లు మున్సిపల్ కార్యాలయంలో సోమవారం ఆయన పాలకవర్గం, అధికారులతో సమీక్షా సమావేశం నిర్వహించారు. ఆమనగల్లు మున్సిపాలిటీకి టీయూఎఫ్ఐడీసీ కింద మంజూరైన రూ.15 కోట్లతో చేపట్టే అభివృద్ధి పనులపై చర్చ జరిగింది వివరించారు. ఆయా పనులకు ఈనెల 15న శంకుస్థాపన చేపట్టాలని సమావేశంలో నిర్ణయించారు. అనంతరం ఎమ్మెల్యే జైపాల్‌యాదవ్ మాట్లాడుతూ.. ఆమనగల్లు మున్సిపాలిటీ పరిధిలో రూ.1.20 కోట్లతో నిర్మించిన మోడల్ గ్రంథాలయ భవన నిర్మాణం పూర్తయ్యిందని ఈనెలాఖరులోగా దానిని ప్రారంభిస్తామని చెప్పారు. రూ.4.5 కోట్లతో నిర్మిస్తున్న ఇంటిగ్రేటెడ్ మార్కెట్ పనులు చురుకుగా సాగుతున్నాయని చెప్పారు. రూ.1.50 కోట్లతో నిర్మిస్తున్న ప్రభుత్వ జూనియర్ కళాశాల భవన నిర్మాణ పనులను వీలైనంత త్వరగా పూర్తిచేసి అందుబాటులోకి తీసుకువస్తామని చెప్పారు.

రూ.32 కోట్లతో భగీరథ పనులు పూర్తి..

మిషన్ భగీరథ అసంపూర్తి పనులకు రూ.32 కోట్లు మంజూరైనట్లు ఎమ్మెల్యే వివరించారు. ఆమనగల్లు పట్టణంలో షాద్‌నగర్ రోడ్డు నుంచి మాడ్గుల రోడ్డు వరకు చేపట్టే రోడ్డు వెడల్పు పనులకు అందరూ సహకరించాలని ఎమ్మెల్యే కోరారు. అభివృద్ధి కార్యక్రమాల్లో రాజకీయాలకతీతంగా సహకారం అందించాలని కోరారు. అధికారులు, ప్రజాప్రతినిధులు సమన్వయంతో పనిచేయాలని సూచించారు. సమావేశంలో మున్సిపల్ చైర్మన్ రాంపాల్‌నాయక్, వైస్ చైర్మన్ దుర్గయ్య, మున్సిపల్ కమిషనర్ శ్యాంసుందర్, కౌన్సిలర్లు విజయ్‌కృష్ణ, చెన్నకేశవులు, లక్ష్మణ్, శ్రీధర్, రాములు, జయరాంనాయక్, జిల్లా గ్రంథాలయ సంస్థ డైరెక్టర్ రాధమ్మ, మున్సిపల్ బీఆర్ఎస్ అధ్యక్షుడు పత్యానాయక్, పోలెపల్లి ఎంపీటీసీ సభ్యులు కుమార్, అధికారులు పాల్గొన్నారు.

సమస్యలు పరిష్కరించండి

ఎంపీడీఓ కార్యాలయం ఎదుట ఉపాధి కూలీల ఆందోళన



ఎంపీడీఓ చాంబర్ ఎదుట బైఠాయించిన ఉపాధి కూలీలు

యాచారం: ఉపాధి కూలీల సమస్యలు పరిష్కరించడంతో పాటు చేసిన పనులకు వెంటనే డబ్బులు అందేలా చర్యలు తీసుకోవాలని డిమాండ్ చేస్తూ సోమవారం వివిధ గ్రామాల ఉపాధి కూలీలు ఎంపీడీఓ కార్యాలయాన్ని ముట్టడించారు. కేంద్ర ప్రభుత్వం తీసుకువచ్చిన కొత్త చట్టంతో ఉపాధి కూలీలకు ఇబ్బందులు తప్పడం లేదన్నారు. కొత్త నిబంధనలతో పనిచేయడం కష్టంగా మారిందని అలాగే చేసిన పనులకు సకాలంలో డబ్బులు రావడంలేదంటూ వాపోయారు. చేసేదిలేక ఆందోళన కార్యక్రమాన్ని చేపట్టినట్లు తెలిపారు. అధికారుల నుంచి సరైన హామీ లేకపోవడంతో కూలీలు ఎంపీడీఓ చాంబర్ ఎదుట బైఠాయించారు. కలెక్టర్ వచ్చి సమస్య పరిష్కరించాలని నినాదాలు చేశారు. వ్యవసాయ కార్మిక సంఘం ఆధ్వర్యంలో జరిగిన ఈ ధర్నా గంటపాటు జరిగింది. డ్వామా అడిషనల్ ఏపీడీ జంగారెడ్డి.. కూలీలతో మాట్లాడి సమస్యలన్నీ త్వరగా పరిష్కరిస్తానని హామీ ఇవ్వడంతో కూలీలు ఆందోళన విరమించారు. ఈ సందర్భంగా వ్యవసాయ కార్మిక సంఘం జిల్లా అధ్యక్షుడు పి.అంజయ్య మాట్లాడుతూ... కేంద్ర ప్రభుత్వం తెచ్చిన కొత్త చట్టంతో ఉపాధి కూలీలకు భరోసా లేకుండా పోయిందని అన్నారు. నింబంధనల పేరుతో అధికారులు కూడా ఇబ్బందులు పడుతున్నారన్నారు. ఉపాధి కూలీలు పనులు చేసే చోట మెడికల్ కిట్లు, ఓఆర్ఎస్ ప్యాకెట్లు, నీడ, తాగునీరు అందుబాటులో ఉంచాలని డిమాండ్ చేశారు. అనంతరం పలు డిమాండ్లతో కూడిన వినతిపత్రాన్ని ఎంపీడీఓ విజయలక్ష్మికి అందజేశారు. ఈ కార్యక్రమంలో నాయకులు జంగయ్య, రాములు, శివ, ఇందిరమ్మ, సంజీవ, శోభ, విప్లవ్‌కుమార్, వెంకటయ్య తదితరులు పాల్గొన్నారు.

రైతులను ఇబ్బంది పెట్టొద్దు



ధాన్యం కొనుగోలు కేంద్రాన్ని ప్రారంభిస్తున్న ఎంపీపీ సుకన్య

- ఎంపీపీ కొప్పు సుకన్య
- నందివనపర్తిలో ధాన్యం కొనుగోలు కేంద్రం ప్రారంభం

యాచారం: మండల పరిధిలోని నందివనపర్తి గ్రామంలో సోమవారం డీసీఎంఎస్ ఆధ్వర్యంలో వరి ధాన్యం కొనుగోలు కేంద్రాన్ని ఎంపీపీ కొప్పు సుకన్య, రైతుబంధు సమితి జిల్లా అధ్యక్షుడు వంగేటి లక్ష్మారెడ్డి ప్రారంభించారు. వారు మాట్లాడుతూ...కొలతలు, తూకాల్లో తేడా లేకుండా జాగ్రత్తలు తీసుకోవాలని సూచించారు. నింబంధనల పేరుతో రైతులను ఇబ్బందులకు గురిచేస్తే సహించేది లేదని అన్నారు. ధాన్యం విక్రయించిన వెంటనే రైతుల బ్యాంకు ఖాతాల్లో డబ్బులు జమచేసేలా చూడాలని అధికారులకు సూచించారు. ఈ కార్యక్రమంలో జెడ్పీటీసీ సభ్యురాలు జంగమ్మ, ఇబ్రహీంపట్నం వ్యవసాయ మార్కెట్ కమిటీ చైర్మన్ చంద్రయ్య, యాచారం పీఏసీఎస్ చైర్మన్ రాజేందర్‌రెడ్డి, నందివనపర్తి సర్పంచ్ ఉదయశ్రీ తదితరులు పాల్గొన్నారు.

నేడు మాసబ్ చెరువు వద్ద అఖిలపక్షం ధర్నా

తుర్కయంజాల్: మున్సిపాలిటీ పరిధి మాసబ్ చెరువులో చేపడుతున్న అక్రమ కట్టడాలను అరికట్టడంతోపాటు చెరువును మళ్లీ రీసర్వే చేసి ఎఫ్‌టీఎల్ హద్దులను ఏర్పాటు చేయాలని డిమాండ్ చేస్తూ మంగళవారం అఖిలపక్షం, మాసబ్ చెరువు పరిరక్షణ సమితి ఆధ్వర్యంలో ధర్నా నిర్వహించనున్నట్లు అఖిలపక్ష నాయకులు సోమవారం ఒక ప్రకటనలో తెలిపారు. ఉదయం 10 గంటలకు చెరువు వద్ద చేపట్టనున్న ఈ ధర్నాకు అన్ని రాజకీయ పార్టీల నాయకులు, రైతులు, యువజన సంఘాల సభ్యులు, ప్రజలు పెద్ద ఎత్తున తరలిరావాలని వారు కోరారు.

అంబేడ్కర్ విగ్రహ నిర్మాణానికి విరాళం

తలకొండపల్లి: మండల పరిధిలోని మెదక్‌పల్లిలో అంబేడ్కర్ విగ్రహ నిర్మాణానికి జిల్లా జర్నలిస్టు నాయకుడు దర్వుల శంకర్, దళిత సంఘాల నాయకులు సోమవారం రూ.50 వేలు విరాళంగా అందజేశారు. దర్వుల శంకర్ ఆధ్వర్యంలో విరాళాలు సేకరణ చేపట్టారు. ఈ సందర్భంగా దర్వుల శంకర్ వ్యక్తిగతంగా రూ.25,000, దళిత సంఘాల నాయకులు రూ.25,000 విరాళంగా అందజేశారు. యువత అంబేడ్కర్‌ను ఆదర్శంగా తీసుకొని ముందుకు వెళ్లాలన్నారు. ఆయన ఆశయ సాధనే లక్ష్యంగా ముందుకు సాగాలన్నారు. ఈ కార్యక్రమంలో శంకర్, రామచంద్రయ్య, గోపాల్, మహేష్, అభిషేక్, రాఘవేందర్, అర్జున్, రజనీకాంత్, సురేష్, నవీన్, పంతూ, అంజయ్య, రాజు, యాదయ్య, పాండు, రాములు పాల్గొన్నారు.

278 మందికి కంటి పరీక్షలు

తలకొండపల్లి: మండల పరిధిలోని ఖానాపూర్, వెంకట్రావ్‌పేట్ కంటి వెలుగు శిబిరాల్లో సోమవారం 278 మందికి పరీక్షలు నిర్వహించారు. కంటి వెలుగు శిబిరాలను సద్వినియోగం చేసుకోవాలని స్థానిక నేతలు తెలిపారు. అవసరమైనవారికి ప్రభుత్వం కళ్లద్దాలు అందజేయడంతోపాటు శస్త్ర చికిత్సలు చేయిస్తోందన్నారు. వైద్యులు మల్లికార్జున్, శివకుమార్, కల్పన, సైదమ్మ, సిబ్బంది రామచంద్రయ్య పాల్గొన్నారు.

'డబుల్' ఇళ్లకు లాటరీ

మంచాల: మంచాల మండల కేంద్రంలో డబుల్ బెడ్‌రూం ఇళ్ల లబ్ధిదారుల ఎంపికను లాటరీ పద్ధతిలో తీశారు. సోమవారం ప్రత్యేకంగా గ్రామసభ నిర్వహించి డబుల్ బెడ్‌రూం ఇళ్ల లబ్ధిదారులుగా 30 మందిని ఎంపిక చేశారు. ఎవరికీ ఎలాంటి ఇబ్బంది లేకుండా లాటరీ పద్ధతిలో లబ్ధిదారులను ఎంపిక చేశారు. తహసీల్దార్ అనిత, సర్పంచ్ అనిరెడ్డి జగన్‌రెడ్డి, ఎంపీటీసీ సభ్యుడు ఎడ్మా నరేందర్‌రెడ్డి, పంచాయతీ కార్యదర్శి రాజ్‌కుమార్, వార్డుసభ్యులు పాల్గొన్నారు.

ఉద్యోగాలను క్రమబద్ధీకరించండి



ఆమనగల్లు: వంటావార్పుతో నిరసన తెలుపుతున్న కార్యదర్శులు

11వ రోజుకు చేరుకున్న జేపీఎస్‌ల సమ్మె

ఆమనగల్లు: జూనియర్ పంచాయితీ కార్యదర్శుల ఉద్యోగాలను ప్రభుత్వం వెంటనే క్రమబద్ధీకరించాలని కల్వకుర్తి టీడీపీ ఇన్‌చార్జి యాదిలాల్, ఆమనగల్లు మాజీ జెడ్పీటీసీ సభ్యులు శ్రీపాతి శ్రీనివాస్‌రెడ్డి డిమాండ్ చేశారు. ఆమనగల్లు ఎంపీడీఓ కార్యాలయం ఆవరణలో జూనియర్, ఔట్‌సోర్సింగ్ గ్రామ కార్యదర్శులు చేపట్టిన సమ్మె సోమవారంతో 11వ రోజుకు చేరుకుంది. నిరసన కార్యక్రమంలో భాగంగా వంటావార్పు కార్యక్రమం నిర్వహించారు. ఈ కార్యక్రమంలో సర్పంచ్‌లు మంజుల, లచ్చి, ప్రేమలత, శ్రీనయ్య, యువజన కాంగ్రెస్ జిల్లా కార్యదర్శి కృష్ణనాయక్, మహేశ్వరం డివిజన్ గ్రామ కార్యదర్శుల సంఘం అధ్యక్షుడు జావిద్, గ్రామ కార్యదర్శులు రమేశ్, రాము, మురళిమోహన్, శివకుమార్, వాజిద్ పాల్గొన్నారు.

చర్చలకు పిలవాలి..

ఇబ్రహీంపట్నం: ఇబ్రహీంపట్నం ఎంపీడీఓ కార్యాలయ ఆవరణలో జూనియర్, ఔట్ సోర్సింగ్ గ్రామ కార్యదర్శులు చేపట్టిన సమ్మె సోమవారం 11వ రోజుకు చేరుకుంది. సీపీఎం జిల్లా కార్యదర్శి కాడిగళ్ల భాస్కర్ సోమవారం ఉద్యోగులకు సంఘీభావం ప్రకటించారు. ప్రభుత్వం జేపీఎస్‌లను బేషరతుగా చర్చలకు పిలిచి సమస్యలను పరిష్కరించాలని డిమాండ్ చేశారు. ఈ కార్యక్రమంలో ఆ పార్టీ నాయకులు యాదయ్య, సామేల్, జగదీశ్, అలంపల్లి నర్సింహ, బుగ్గరాములు జంగయ్య, జగన్, రాజు, శంకర్, కిషన్, ఎల్లేష్ పాల్గొన్నారు.

ధరణి సమస్యలను పరిష్కరించండి

మంచాల: ధరణిలో నెలకొన్న సమస్యలను తక్షణమే సరిచేయాలని బండలేమూర్ మాజీ సర్పంచ్ పోచమోని కృష్ణ డిమాండ్ చేశారు. సోమవారం రంగారెడ్డి జిల్లా కలెక్టరేట్ కార్యాలయంలో ప్రజావాణిలో జాయింట్ కలెక్టర్ తిరుపతిరావుకు ఈమేరకు వినతిపత్రం అందజేశారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ.. ధరణి కంటే ముందు రైతుల సమస్యలు సత్వరమే పరిష్కారం అయ్యేవని అన్నారు. ధరణి వచ్చిన తర్వాత కనీసం ఫిర్యాదులు చేసినా పట్టించుకునే నాథుడు లేడని ఆవేదన వ్యక్తం చేశారు. రెవెన్యూ సమస్యలపై ఆన్‌లైన్‌లో దరఖాస్తు చేసుకొని సంవత్సరాలు గడుస్తున్నా పరిష్కారం లభించడం లేదన్నారు. ఇనాం భూములకు సంబంధించిన హక్కు పత్రాలు ఓఆర్‌సీ-2020లో వచ్చినా ఇప్పటికీ పాసుపుస్తకాలు రాలేదన్నారు. ఉన్న భూమిలో కొంత రికార్డులో ఎక్కించలేదన్నార. రెవెన్యూ సమస్యలు పరిష్కారం కాకపోవడంతో రైతుబంధు సహాయం అందక రైతులు నష్టపోతున్నారని తెలిపారు. తక్షణమే ధరణిలో నెలకొన్న సమస్యలను పరిష్కారించాలన్నారు. రైతులకు న్యాయం చేయాలన్నారు. రైతులు జంగయ్య, గండయ్య, శంకరయ్య, పెంటయ్య, ఎల్లయ్య, రాములు, అంజయ్య, లక్ష్మమ్మ తదితరులు పాల్గొన్నారు.

20న బీఆర్ఎస్ యువ సమ్మేళనం

ఇబ్రహీంపట్నం: యువతకు ఎల్లప్పుడు బీఆర్ఎస్ రాష్ట్ర నాయకుడు మంచిరెడ్డి ప్రశాంత్‌కుమార్‌రెడ్డి అండగా ఉంటున్నారని ఇబ్రహీంపట్నం మండల ఎంపీటీసీల ఫోరం అధ్యక్షుడు ఏనుగు భరత్‌రెడ్డి, పోచారం ఉపసర్పంచ్ భగీరథసాగర్ అన్నారు. తుర్కగూడలో సోమవారం వారు మాట్లాడుతూ.. ప్రశాంత్‌కుమార్‌రెడ్డి ఆధ్వర్యంలో ఈనెల 20న నిర్వహించే నియోజకవర్గ యువ సమ్మేళనాన్ని విజయవంతం చేయాలని పిలుపునిచ్చారు. యువత, విద్యార్థులు తరలిరావాలని కోరారు. ఈ కార్యక్రమంలో విద్యార్థి, యువజన విభాగాల అధ్యక్షులు గణేశ్‌గౌడ్, జలేందర్, బీఆర్ఎస్ నాయకులు పాల్గొన్నారు.

మంత్రి సబితకు రుణపడి ఉంటాం

బ్రాహ్మణ సంఘాల ఐక్యవేదిక సభ్యులు



సీఎం కేసీఆర్, మంత్రి సబితారెడ్డి చిత్రపటాలకు క్షీరాభిషేకం చేస్తున్న బ్రాహ్మణసంఘం నేతలు

దిల్‌సుఖ్‌నగర్: మహేశ్వరం నియోజకవర్గంలో బ్రాహ్మణ భవన నిర్మాణం కోసం వేయి గజాల స్థలాన్ని మంత్రి సబితా ఇంద్రారెడ్డి కేటాయించడంపై బ్రాహ్మణ సంఘాల ఐక్యవేదిక హర్షం వ్యక్తం చేసింది. ఈ మేరకు బ్రాహ్మణ సంఘం ప్రతినిధులు, బీఆర్ఎస్ నాయకులు సబితారెడ్డి చిత్రపటానికి పాలాభిషేకం చేశారు. సోమవారం ఆర్‌కేపురం బీఆర్ఎస్ పార్టీ కార్యాలయంలో ఏర్పాటు చేసిన సమావేశంలో ఆ పార్టీ మహేశ్వం నియోజకవర్గ ప్రధాన కార్యదర్శి మురుకుంట్ల అరవింద్ శర్మ, రాష్ట్ర గ్రంథాలయ సంస్థ చైర్మన్ అయాచితం శ్రీధర్, బ్రాహ్మణ సంఘాల ఐక్యవేదిక చైర్మన్ మంగు రాఘవరావు, జనరల్ సెక్రెటరీ ప్రమోద్ కొటార్ మాట్లాడుతూ, మహేశ్వరం నియోజకవర్గంలో బ్రాహ్మణులు అధిక సంఖ్యలో ఉన్నారని, వారి కోసం బ్రాహ్మణ భవనం నిర్మించాలని తాము మంత్రికి విజ్ఞప్తి చేయడంతో వెయ్యి గజాలను కేటాయించారన్నారు. నియోజకవర్గంలోని ఐదు ఆలయాలకు.. ఒక్కోదానికి రూ. కోటి స్పెషల్ ఫండ్‌ను మంత్రి కేటాయించడం హర్షనీయమని బ్రాహ్మణ సంఘ సభ్యులు తెలిపారు. నియోజకవర్గ బ్రహ్మణులంతా మంత్రి సబితకు రుణపడి ఉంటారని తెలిపారు. కార్యక్రమంలో గ్రంథాలయాలు సంస్థ డైరెక్టర్ పంతంగి మాధవి, బ్రహ్మణ సంఘం రాష్ట్ర నాయకులు తులసి శ్రీనివాస్, మునిపల్లె శ్రీనివాస్, ప్రకాష్ మధుసూదన్ రావు, యాదగిరి రావు, రఘునందన్ రావు, రాజేశ్వర శర్మ, శ్యాంసుందర్ ఆచార్యులు, రమా శంకర్, బొడ్డుపల్లి రామ్మోహన్, రామాచారి పాల్గొన్నారు.

క్రీడల్లో గెలుపోటములు సహజం



ట్రోఫీ అందజేస్తున్న వీరేందర్ గౌడ్, నిర్వాహకులు

బీజేపీ రాష్ట్ర అధికార ప్రతినిధి వీరేందర్‌గౌడ్

మహేశ్వరం: క్రీడలతో మానసిక ఉల్లాసాన్ని పెంపొందిస్తాయని బీజేపీ రాష్ట్ర అధికార ప్రతినిధి తూళ్ల వీరేందర్ గౌడ్ పేర్కొన్నారు. మండల పరిధిలోని నాగారం గ్రామంలో దేవేంద్ర ఫౌండేషన్ ఆధ్వర్యంలో మే1న ప్రారంభమైన భజరంగ్‌దళ్ క్రికెట్ టోర్నమెంట్ సోమవారం ముగిసింది. విజేతలకు వీరేందర్‌గౌడ్ బహుమతులు అందజేశారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ... యువత చదువుతో పాటు క్రీడలపై ఆసక్తి పెంచుకోవాలన్నారు. ప్రతిరోజు క్రీడలకు కొంత సమయాన్ని కేటాయించాలన్నారు. సామాజిక సేవే లక్ష్యంగా దేవేంద్ర ఫౌండేషన్ పని చేస్తుందన్నారు. భవిష్యత్తులో ఫౌండేషన్ ఆధ్వర్యంలో మరిన్ని సేవా కార్యక్రమాలు నిర్వహిస్తామన్నారు. ఆటల్లో గెలుపు ఓటములు సహజమన్నారు. కగా హర్షగూడ జట్టు విన్నర్‌గా, నాగారం జట్టు రన్నర్‌గా నిలిచాయి. విన్నర్ జట్టుకు రూ.30 వేల నగదు, ట్రోఫీ, రన్నర్‌కు రూ.16 వేల నగదు, ట్రోఫీలను అందజేశారు. ఈ కార్యక్రమంలో బీజేపీ కిసాన్‌మోర్చా జాతీయ నాయకులు పాపయ్యగౌడ్, బీజేపీ జిల్లా ప్రధాన కార్యదర్శి సుదర్శన్‌రెడ్డి, జిల్లా కార్యదర్శి యాదయ్యగౌడ్, నాయకులు శ్రీనివాస్ యాదవ్, సురేష్, శ్రీశైలం, హరిలాల్, యుగేందర్, మోహన్ నాయక్, శ్రీహరి, మహేష్ యాదవ్, రవితేజ, క్రీడాకారులు పాల్గొన్నారు.

వ్యర్థాల డంపింగ్‌తో ప్రయాణికులకు ఇక్కట్లు



హయత్‌నగర్ బాతుల చెరువు కట్టకింద డంప్ చేసిన నిర్మాణ వ్యర్థాలు

హయత్‌నగర్: హయత్‌నగర్‌లోని బాతుల చెరువు కట్టకింద ఉన్న తొర్రూర్ రోడ్డు పక్కన నిత్యం నిర్మాణ వ్యర్థాలను డంపింగ్ చేస్తుండటంతో ఆ రోడ్డు వెంట వెళ్లే ప్రయాణిలు తీవ్ర ఇబ్బందులు ఎదుర్కొంటున్నారు. నిర్మాణాలు కూల్చి వేసిన అనంతరం మిగిలిన కాంక్రీట్, మట్టి తదితర వ్యర్థాలతో పాటు చెత్తాచెదారం తీసుకొచ్చి రోడ్డు పక్కన వేస్తున్నారు. కొంత కాలంగా ఈ డంపింగ్ కొనసాగుతున్నా... అటు ఆర్ అండ్ బీ అధికారులు గానీ, మున్సిపాలిటీ అధికారులుగానీ పట్టించుకోకపోవడంతో కుప్పలుగా కుప్పలుగా డంపింగ్ వ్యర్థాలు పేరుకుపోతున్నాయి. రోజు రోజుకూ డంపింగ్ ఎక్కవ అవుతుండడంతో ఆ రోడ్డుపై వెళ్లే ప్రయాణికులు తీవ్ర కష్టాలను ఎదుర్కొంటున్నారు. రోడ్డు పైకి రాళ్లు, దుమ్ము, ధూళి వస్తుండటంతో ప్రమాదాలు కూడా జరుగుతున్నాయి. తీవ్ర ట్రాఫిక్‌కు తోడుగా రోడ్డు పక్కన డంపింగ్ కారణంగా రోడ్డు మరింత ఇరుకుగా మారి తరుచూ ట్రాఫిక్ జామ్ అవుతోందని స్థానికులు తెలిపారు. ఇప్పటికైనా అధికారులు స్పందించి రోడ్డుపక్కన వ్యర్థాల డంపింగ్‌ను అడ్డకోవాలని, ఇప్పటికే డంపింగ్ చేసిన వ్యర్థాలను తొలగించాలని వారు కోరుతున్నారు.

విద్యుదాఘాతంతో ఆవు మృతి



ఆవు కళేబరం

తలకొండపల్లి: విద్యుదాఘాతంతో ఆవు మృతి చెందిన సంఘటన మండల పరిధిలోని మెదక్‌పల్లిలో సోమవారం చోటు చేసుకుంది. గ్రామస్తులు తెలిపిన ప్రకారం.. గ్రామానికి చెందిన అల్వాల్ రాఘవేందర్‌గౌడ్ సోమవారం ఆవును మేతకు వదిలాడు. ఓ విద్యుత్ స్తంభం వద్ద విద్యుత్‌వైర్ తెగిపడింది. ఆవు తీగపై కాలు వేడయంతో విద్యుదాఘాతానికి గురై అక్కడికక్కడే మృతి చెందింది. జీవనోపాధికి ఆవును కొనుగోలు చేస్తే విద్యుదాఘాతంతో చనిపోయిందని దీంతో రూ.లక్ష నష్టం వాటిల్లిందని బాధితుడు వాపోయాడు. ప్రభుత్వమే తనను ఆదుకోవాలని కోరారు.

కాంగ్రెస్‌తోనే యువతకు న్యాయం

యువ సంఘర్షణ సభకు తరలిన నేతలు



ఆమనగల్లు నుంచి తరలుతున్న కాంగ్రెస్ నాయకులు

ఆమనగల్లు: హైదరాబాద్‌లో కాంగ్రెస్ పార్టీ ఆధ్వర్యంలో నిర్వహిస్తున్న యువ సంఘర్షణ సభకు ఆమనగల్లు పట్టణం నుంచి పెద్దఎత్తున ఆ పార్టీ నాయకులు, కార్యకర్తలు తరలివెళ్లారు. మాజీ జెడ్పీటీసీ సభ్యుడు శ్రీనివాస్‌రెడ్డి, ఆమనగల్లు మండల కాంగ్రెస్ అధ్యక్షుడు రాములు, మున్సిపాలిటీ కాంగ్రెస్ అధ్యక్షుడు మానయ్య, కాంగ్రెస్‌పార్టీ నాయకులు కృష్ణనాయక్, ఖాదర్, ఫరీద్, శ్రీకాంత్, ఖాదర్, శ్రీశైలం, సురేశ్‌నాయక్, కృష్ణయ్య,షర్ఫుద్దీన్, మహేశ్ తదితరులు ఉన్నారు.

కడ్తాల్ మండలం నుంచి..

కడ్తాల్: రానున్న ఎన్నికల్లో కాంగ్రెస్ పార్టీ రాష్ట్రంలో అధికారంలోకి రావడం ఖాయమని డీసీసీ అధికార ప్రతినిధి శ్రీనివాస్‌రెడ్డి అన్నారు. యువ సంఘర్షణ నిరుద్యోగ నిరసన సభను పురస్కరించుకుని సోమవారం మండల కేంద్రంలో కాంగ్రెస్ పార్టీ నాయకులు ర్యాలీ నిర్వహించారు. కాంగ్రెస్ పార్టీ జాతీయ నాయకురాలు ప్రియాంకా గాంధీ హాజరవుతున్న బహిరంగ సభకు కాంగ్రెస్, యువజన కాంగ్రెస్, ఎన్ఎస్‌యూఐ కార్యకర్తలు కడ్తాల్ నుంచి హైదరాబాద్‌కు తరలివెళ్లారు. ఈ కార్యక్రమంలో జిల్లా కాంగ్రెస్ ప్రధాన కార్యదర్శి బీక్యానాయక్, మాజీ జెడ్పీటీసీ శ్రీనివాస్‌రెడ్డి, మండల కాంగ్రెస్ అధ్యక్షుడు బీచ్యానాయక్, సర్పంచ్ శంకర్, కోఆప్షన్ సభ్యుడు జహంగీర్‌బాబా, పట్టణ అధ్యక్షుడు రాంచందర్‌నాయక్, నాయకులు ఉన్నారు.

తలకొండపల్లి మండలం నుంచి..

తలకొండపల్లి: టీపీసీసీ చీఫ్ రేవంత్‌రెడ్డి ఆధ్వర్యంలో తలపెట్టిన నిరుద్యోగ నిరసన సభకు కాంగ్రెస్ జిల్లా ప్రధాన కార్యదర్శి గుజ్జల మహేష్ ఆధ్వర్యంలో మండల కేంద్రం నుంచి సోమవారం కాంగ్రెస్ నాయకులు భారీగా తరలివెళ్లారు. పదవ తరగతి పరీక్ష అవకతవకలు, టీఎస్‌పీఎస్సీ ప్రశ్నాపత్రాల లీకేజీలతో ప్రభుత్వం అసమర్థత బయటపడిందని మహేష్ చెప్పారు. మాజీ ఎంపీటీసీ రాములు, కిసాన్ సెల్ మండలాధ్యక్షుడు విష్ణుగౌడ్, యూత్ కాంగ్రెస్ నాయకులు తిరుపతి యాదవ్, కాంగ్రెస్ వర్కింగ్ ప్రెసిడెంట్ శివకుమార్‌గౌడ్, ఎన్‌ఎస్‌యూఐ మండల అధ్యక్షుడు రమేష్‌నాయక్, యువ నాయకులు తదితరులు పాల్గొన్నారు.

అధికారంలోకి వస్తాం..

యాచారం: తెలంగాణ రాష్ట్రానికి ఏఐసీసీ నేత ప్రియాంకగాంధీ రాకతో కాంగ్రెస్ శ్రేణుల్లో నూతన ఉత్తేజం, భవిష్యత్తులో అధికారంలోకి వస్తామనే భరోసా కలిగిందని మాజీ ఎమ్మెల్యే, ఏఐసీసీ కిసాన్ సెల్ ఉపాధ్యక్షుడు ముదిరెడ్డి కోదండరెడ్డి పేర్కొన్నారు. ప్రియాంకగాంధీ సోమవారం తెలంగాణ రాష్ట్రానికి వచ్చిన దృష్ట్యా కోదండరెడ్డి ఆమెకు బేగంపేట ఎయిర్‌పోర్టులో ఘన స్వాగతం పలికారు. తెలంగాణ రాష్ట్రంలో ఈ ఏడాది జరిగే పార్లమెంట్, అసెంబ్లీ ఎన్నికల్లో కాంగ్రెస్ పార్టీ అధికారంలోకి రావడం ఖాయం అన్నారు.